ప్రజాశక్తి
సోమవారం 22 జులై 2024 5
శ్రీ సత్యసాయి





జలకళ సంతరించుకున్న తుంగభద్ర జలాశయం

నేడు హెచ్ఎల్సికి నీరు విడుదల

తుంగభద్ర డ్యామ్‌కు పోటెత్తుతున్న వరద
1.16 లక్షల క్యూసెక్కులకు చేరిన ఇన్‌ఫ్లో

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు సోమవారం నుంచి తుంగభద్ర డ్యామ్ నుంచి నీటిని విడుదల చేయనున్నారు. ఈనెల 16వ తేదీ నుంచి తుంగభద్ర డ్యామ్‌కు ఇన్‌ఫ్లో 28 వేల క్యూసెక్కులు రావడం మొదలైంది. ఆదివారం నాటికి అవి 1.16 లక్షల క్యూసెక్కులకు చేరుకున్నాయి. దీంతో తుంగభద్ర డ్యామ్ నిండుకుండలా మారింది. పూర్తి నిలువ సామర్థ్యం 105 టిఎంసిలు అయితే ప్రస్తుతం నీటి నిలువ 74 టిఎంసిలకు చేరింది. వరద పోటు ఇదే విధంగా కొనసాగితే మరో రెండు రోజుల్లో పూర్తి సామర్థ్యంతో డ్యామ్ నిండనుంది. దీంతో అధికారులు ఇప్పటికే డ్యామ్ పరిధిలోని పంటకాలువలకు నీటి విడుదలపై నిర్ణయం తీసుకున్నారు.

నేటి నుంచి తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు నీరు

అనంతపురం జిల్లాకు సాగు,తాగునీటిని అందించే ప్రధాన కాలువ అయిన తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు సోమవారం నుంచి నీటిని విడుదల చేయాలని హెచ్ఎల్సి అధికారులు బోర్డును కోరారు. డ్యామ్‌కు నీరు కూడా పుష్కలంగా చేరుతుండటంతో తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు నీరు విడుదల చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే కర్నాటక ప్రాంతంలోనూ ఇండెంట్ రావడంతో రెండూ కలిపి ఎగువ ప్రధాన కాలువకు నీరు విడుదల కానుంది. ఈ ఏడాది 26 టిఎంసిల వరకు నీటిని తీసుకునేందుకు వీలుందని ముందుగా అధికారులు అంచనా వేశారు. ఆ మేరకు నీటిని జిల్లాకు తీసుకునేందుకు ఇక్కడి అధికారులు చర్యలు చేపట్టారు.

కాలువ పటిష్టతపైనే సందేహాలు ?

కర్నాటకలో సకాలంలో వర్షాలు రావడంతో డ్యామ్‌కు నీరొచ్చి అనుకున్న సమయానికి ఎగువ ప్రధాన కాలువకు నీరు తీసుకునే వెసులుబాటు లభించింది. అయితే ప్రధాన కాలువ పటిష్టతపైనే సందేహాలున్నాయి. ఎందుకంటే గడిచిన కొన్నేళ్లుగా ఈ కాలువ పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. తక్షణం మరమ్మతులు చేపట్టాల్సినవి ఉన్నాయి. అయితే నిధుల్లేక అధికారులు ఉన్న కాడికే నెట్టుకొస్తున్నారు. ప్రస్తుతం అనంతపురం జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న తరుణంలో ఈ నీరు జిల్లాకు తీసుకురావడం ఎంతో అవసరం. అయితే కాలువ గట్లు బలహీనంగా ఉండటంతో పూర్తి స్థాయి సామర్థ్యంతో నీటిని తీసుకునే అవకాశంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నాం

తుంగభద్ర డ్యామ్ నుంచి సోమవారం నుంచి నీటిని తీసుకునేందుకు ఇండెంట్ ఇచ్చాం. డ్యామ్‌లోనూ నీరు పుష్కలంగా ఉన్నందున నీటి విడుదల చేయనున్నారు. వచ్చే నీటిని జాగ్రత్తగా జిల్లాకు చేర్చేందుకు అవసరమైన విధంగా చర్యలు చేపడుతున్నాం. కొన్ని చోట్ల గట్లు బలహీనంగా ఉన్న మాట వాస్తవమే. అయితే అప్రమత్తంగా ఉండి నీటిని తీసుకొచ్చే విధంగా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

రాజశేఖర్
ఎస్ఇ, హెచ్ఎల్సి

- 'ఉచిత ఇసుక'కు ఖర్చు ఎక్కువ
- అక్రమార్కులను ఆశ్రయిస్తున్న వినియోగదారులు
- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- నిఘా పెట్టని అధికార యంత్రాంగం
- కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

పేట్రేగిన ఇసుకాసురులు



పట్టణంలోని ముదిరెడ్డిపల్లిలో ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం చేస్తున్నాడు. ఈ వ్యక్తి పదుల సంఖ్యలో ట్రాక్టర్లను ఏర్పాటు చేసి, రోజుకు వందల లోడ్‌ల ఇసుకను పక్కన ఉన్న పెన్నా నదిలో నుంచి అక్రమంగా ఇసుకను తరలించుకున్నారు. రూరల్ మండలం బేవినహళ్లి వద్ద ఉన్న నదిలో నుంచి ఓ ప్రజా ప్రతినిధి సోదరుడిని తనయుడు పదుల సంఖ్యలో ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకుని పట్టణ వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు అక్రమంగా ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇసుక ఉచితం పథకంలో రవాణా ఖర్చులు పేరుమీద విధిస్తున్న రుసుం ఎక్కువగా ఉండటంతో ఇసుక వినియోగదారులు అక్రమార్కులను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఎలాంటి అనుమతులు లేకుండానే ఇసుకాసురులు అడ్డగోలుగా ఇసుకను తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు.

ప్రజాశక్తి-హిందూపురం

కూటమి అధికారంలోకి వస్తే ఉచితంగా ఇసుక ఇస్తామన్న హామీని అమలు చేసేందుకు ప్రభుత్వం నూతన ఇసుక పాలసీని తీసుకొచ్చింది. జిల్లాలో 5 ప్రాంతాలలో ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేయడంతో పాటు ఇసుకను అక్కడ స్టాక్ చేశారు. అయితే ఇసుక రవాణాపై విధించిన రుసుం ఎక్కువగా ఉండటంతో ఇసుక వినియోగదారులు ప్రయివేటు వ్యక్తులను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఇసుకాసురులు హిందూపురం పట్టణం పక్కన ఉన్న బేవినహళ్లి వద్ద, ముదిరెడ్డిపల్లి వద్ద పెన్నా నదీ పరివాహక ప్రాంతం నుంచి ఇసుకను యథేచ్ఛగా దోచేస్తున్నారు. ఇది తెలిసినప్పటికి అధికార యంత్రాగం ఏమీ పట్టనట్లు ఉంది.సాక్షాత్తు జిల్లా కలెక్టర్ ఇసుక అక్రమ రవాణపై నిఘా ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించినప్పటికి ఆ ఆదేశాలను తుంగలో తొక్కి, పరోక్షంగా అక్రమ ఇసుకాసురులకు సహరిస్తున్నారన్న ఆరోపణలు వినపిస్తున్నాయి.

జిల్లా వ్యాప్తంగా అవసరం ఉన్న వారికి ఉప్పలపాడు, కొడవండ్లపల్లి, నల్లబోయినపల్లి, కుటాగుళ్ళ, రామగిరి స్టాక్ యార్డుల నుండి ఇసుకను అందించే ఏర్పాట్లను అధికారులు చేపట్టారు. ఇసుక నిల్వచేసిన డంపింగ్ యార్డ్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అవసరమైన సిబ్బందిని నియమించారు. 5 స్టాక్ పాయింట్లలో 35 వేల మెట్రిక్ టన్నుల నిల్వ చేసినట్లు అధికారులు చెప్పారు. అక్కడి నుంచి జిల్లా వ్యాప్తంగా ఇసుక అవరమైన వారికి అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఇసుక యార్డులకు ఇతర ప్రాంతాల నుంచి ఇసుక తరలించి, తీసుకువచ్చేందుకు అయ్యే నిర్వాహణ వ్యయాన్ని మాత్రమే వసూలు చేస్తూ, ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఇసుక సరఫరా చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే నిర్వహణ ఖర్చు పేరుతో టన్ను ఇసుకకు రూ.605 ధర నిర్ణయించింది. దీంతో 'ఉచిత ఇసుక' తీసుకునేందుకు ప్రజలు, కాంట్రాక్టర్లు, పరిశ్రమ యజమానులు ముందుకు రావడం లేదు. ఉచితం ఉత్తుత్తిదేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఇసుక కేంద్రాలలో సరఫరా నత్తనడకన సాగుతుంది. ఇసుక ఉచిత పంపిణీ కేంద్రాల నుంచి ఇసుకను తరలించడానికి ట్రాక్టర్ ఇసుక రూ.3,400లు అవుతోంది. ప్రభుత్వ నిబంధల ప్రకారం టన్ను ఇసుకకు రూ.605 చెల్లించాలి. ట్రాక్టర్‌కు నాలుగు టన్నుల ఇసుక పడుతుందనుకుంటే, ట్రాక్టర్‌కు రూ.2420 చెల్లించాలి. ట్రాక్టర్ అద్దె మరో రూ.వెయ్యి చెల్లించాలి. దీంతో ట్రాక్టర్ అద్దె, ఇసుక కేంద్రంలో చెల్లించే సొమ్ముతో కలిపి రూ.3,400కు పైగా ఖర్చవుతోంది. అయితే హిందూపురం పరిసర ప్రాంతాల్లో ఇసుక రీచ్ లేనందున ఇక్కడి వారు ఇసుక కోసం పుట్టపర్తి, రాప్తాడు ప్రాంతాల్లో ఉన్న ఇసుక రీచ్‌లను ఆశ్రయించాల్సుంటుంది. దీంతో రవాణా ఖర్చు తడిసి మోపడవుతుంది. దీంతో ఇసుక కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీనిని ఆసరగా చేసుకుని ఇసుక అక్రమ రవాణాదారులు పట్టణానికి పక్కన ఉన్న పెన్నా నదిని తోడేస్తున్నారు. పెన్నా నదిలో ఇసుక అక్రమంగా తవ్వి తరలిస్తే ట్రాక్టర్ రూ.3500 నుంచి రూ.4వేల వరకు వసూలు చేస్తున్నారు. అయితే ఉచిత ఇసుక కేంద్రం నుంచి ట్రాక్టర్ ఇసుకను హిందూపురం తీసుకు రావలంటే రూ. 5వేల వరకు ఖర్చవుతోంది. అక్రమంగా తవ్వి తరలిస్తున్న ట్రాక్టర్ ఇసుక తీసుకుంటే రూ.15వందల నుంచి 2 వేల రూపాయల వరకు మిగలడంతో ప్రజలు, కాంట్రాక్టర్లు, పరిశ్రమ యజమానులు వారి నుంచే కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక కేంద్రాల నుంచి తీసుకునేందుకు ముందుకు రావడం లేదు. దీంతో ప్రభుత్వ ఇసుక కేంద్రాల వద్ద నుంచి హిందూపురం ప్రాంతానికి ఇసుక రావటం లేదు. అయితే ఇసుక అక్రమ రవాణాదారుల వ్యాపారం మాత్రం పట్టణంలో జోరుగా సాగుతుంది. నిఘా ఏర్పాటు చేయాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. ఇక సెబ్ అధికారులు మాత్రం అడపా దడపా పట్టుకుని జరిమానా వేసి చేతులు దులుపుకుంటున్నారు. ఇటీవల సెబ్ అధికారులు బేవినహల్లి వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకుని జరిమాన వేసి వదిలేశారు. సెబ్ పోలీసులు అడపాదడపా నామమాత్రపు దాడులు చేసి, అరకొర ట్రాక్టర్లను పట్టుకుని వదిలేస్తున్నారు. మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు ప్రేక్షక పాత్రకు పరిమితమయ్యారు.

నిఘా ఏర్పాటు చేసిన ఆగని అక్రమ రవాణ

జిల్లా వ్యాప్తంగా గట్టి నిఘా ఏర్పాటు చేసినా ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. దీని కోసం జిల్లా కలెక్టర్ ఇసుక సరఫరాపై ఫిర్యాదులు. సలహాల కోసం ఒక కంట్రోల్ రూమును ఏర్పాటు చేశారు. అంతేకాక ఒక టోల్ ఫ్రీ నెంబరు 1800-425-6041ను ఏర్పాటు చేశారు. ఎవరైనా ఈ నెంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కలెక్టర్ కోరారు. అక్రమ, అనధికారిక త్రవ్వకాలపై ఉక్కుపాదం మోపుతూ అటువంటి వాటిని నిరోధించేందుకు నిర్ధేశించిన జరిమానాలకు సంబంధించి విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులకు ఆదేశించారు. నిషేధిత ప్రాంతాలైన భూగర్భజల నిర్మాణాలు, వంతెనలు, డ్యామ్‌లు, రైల్వే లైన్ల నుండి 500 మీటర్ల లోపల అక్రమ, అనధికార త్రవ్వకాలకు పాల్పడే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి అటువంటి చోట్ల పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత ఆర్డీవోలు, పోలీస్, సెబ్, మైనింగ్ డిపార్ట్‌మెంట్ సమన్వయంతో పనిచేసి గట్టి నిఘా ఉంచాలని ఆదేశించారు. చట్ట విరుద్ధమైన మైనింగ్, స్టాకింగ్, హోర్డింగ్, అమ్మకం, బ్లాక్ మార్కెట్‌కు పాల్పడే వ్యక్తులపై ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం చర్యలు తీసుకోవాలని, ఈ కార్యక్రమాలకు వినియోగంచే వాహనాలను సీజ్ చేయడంతో పాటు జరిమానాలను విధించాలని ఆదేశించారు. అయినా పట్టణంలో ఇసుక దోపిడీ బహిరంగంగానే సాగుతోంది.



పెన్నానదిలో ఇసుకను తోడుతున్న దృశ్యం



సెబ్ పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

నిఘా ఏర్పాటు చేస్తాం

అక్రమ ఇసుక రవాణాపై జిల్లా కలెక్టర్ అదేశించిన విధంగా గట్టి నిఘా ఏర్పాటు చేశాం. పట్టణం, రూరల్ మండల వ్యాప్తంగా ఎక్కడా ఇసుక రీచ్‌లు లేవు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ల నుంచే ఇసుకను తీసుకు రావాలి. అలా కాకుండా నదీ పరివాహక ప్రాంతాలలో ఇసుకను తరలిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం

శివప్రసాద్ రెడ్డి
తహాశీల్దార్, హిందూపురం

సత్యసాయి సేవలు స్ఫూర్తిదాయకం

హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ శివప్రతాప్ శుక్లా

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

సత్యసాయి మానవాళికి అందించిన సేవలు, బోధనలు ఎప్పటికీ స్ఫూర్తి దాయకంగా నిలుస్తాయని హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. ఆదివారం గురు పౌర్ణమి పండుగ సందర్భంగా పుట్టపర్తి ప్రశాంతి నిలయం సాయి కుల్వంత్ హాలులో జరిగిన కార్యక్రమంలో హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అంతకు ముందు గవర్నర్ దంపతులు సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గవర్నర్ మాట్లాడుతూ ముఖ్యంగా గురువులను స్మరించుకోవడం పూజించుకోవడం గురుపౌర్ణమిఉద్దేశమన్నారు. బాబా మానవసేవే మాధవసేవ అని చెప్పడమే గాక బాబా ట్రస్టు ద్వారా అందించిన సేవలు గొప్పవన్నారు. బాబా ఆశయాలకు అనుగుణంగా ట్రస్టు 140 సత్య సాయి సేవా సమితుల ద్వారా సేవలు అందించడం గొప్ప విషయం అన్నారు. అందుకు ట్రస్టు సభ్యుల సేవా నిరతిని గవర్నర్ అభినందించారు. సత్యసాయి 100 వసంతాల జయంతి పురస్కరించుకొని వికలాంగుల కోసం ట్రస్ట్ చేపట్టిన దివ్యాంగ సేవ ప్రాజెక్టును గవర్నర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జె రత్నాకర్, సభ్యులు చక్రవర్తి, నాగానంద, డాక్టర్ మోహన్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, గీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దంపతులకు ప్రశాంత్ నిలయంలో ఘనంగా స్వాగతం లభించింది. . ఆదివారం ఉదయం గురు పౌర్ణమి వేడుకలలో పాల్గొన్న గవర్నర్ ఆదివారం మధ్యాహ్నం ఇక్కడ నుంచి బెంగళూరు కు కారులో బయలుదేరి వెళ్లారు.



సమావేశంలో మాట్లాడుతున్న హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి

మాజీ ఎమ్మెల్సీ, జెవివి రాష్ట్ర అధ్యక్షులు గేయానంద్

ప్రజాశక్తి-హిందూపురం

సైన్స్ పట్ల విద్యార్థుల్లో ఆసక్తి కలిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో జన విజ్ఞాన వేదిక ప్లీనరీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ, జెవివి రాష్ట్ర అధ్యక్షులు గేయానంద్, జన విజ్ఞాన వేదిక నాయకులు డాక్టర్ గోపాళం శివన్నారాయణ, మహేంద్ర రెడ్డి, డాక్టర్ ఈటి రామ్మూర్తి, పి. రామకృష్ణ, జీఆర్. సిద్ధు, హరి, సడ్డపల్లె చిదంబరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి పెంచి శాస్త్రీయ తృక్పథాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. నిత్య మానవ మనుగడకు సైన్స్ ఎంతో దోహదపడుతుందన్నారు. సైన్స్ లేనిదే మానవ మనుగడ లేదన్నారు. మనిషి దైనందిక జీవితంలో సైన్స్ ఒక భాగమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో నెలకొన్న మూఢనమ్మకాలపై ప్రచారం చేస్తూ అవగాహన కల్పించేందుకు జన విజ్ఞాన వేదిక కృషి చేస్తూ ఉందన్నారు.ఉత్తర ప్రదేశ్ లోని హద్రాస్‌లో భోలేబాబా పాద దూళి స్పర్శ కోసం వెళ్లిన భక్తుల్లో 121 మంది మృతిచెందడం బాధాకరమన్నారు. దీనికి ప్రధాన కారణం మూఢనమ్మకమేనన్నారు. శాస్త్ర సాంకేతిక రంగం ఎంతో అభివృద్ధి చెందుతున్నప్పటికీ ప్రజలు ఇంకా ఇలాంటి మూఢనమ్మకాలపై విశ్వాసం చూపడం సరైనది కాదన్నారు. ప్రభుత్వాలు వీటిని దృష్టిలో ఉంచుకొని మూఢనమ్మకాలపై ప్రత్యేకమైన చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా రోజురోజుకు ఎంతో అభివృద్ధి చెందుతున్న హిందూపురం ప్రాంతంలో ఐటీ పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వాలు తగిన చొరవ చూపాలన్నారు. హిందూపురం వాణిజ్యంగా ఎంతో అభివద్ధి చెందుతుందని దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు ట్రాఫిక్ ఇబ్బందులకు గురికాకుండా రింగ్ రోడ్డును ఏర్పాటు చేయాలన్నారు. హంద్రీనీవా జలాలను పూర్తిస్థాయిలో హిందూపురం ప్రాంతంలోని చెరువులకు నింపి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలని ప్లీనరీ సమావేశంలో తీర్మానాలు చేశారు. అదేవిధంగా లేపాక్షిని పర్యాటక రంగంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో జెవివి ప్రతినిధులు మారుతీ శ్రీనివాస్, చైతన్య గంగిరెడ్డి, మురళీమోహన్, జీఆర్. శ్రీనివాసులు, టికె. లక్ష్మీపతి, ఎం. రామకృష్ణ, రవీంద్రారెడ్డి, అలీముల్లా, హనుమంతప్ప పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్. గేయానంద్

కార్మికుల సంక్షేమానికి పలు ప్రభుత్వ పథకాలు



అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సి.సూర్యనారాయణ

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

కార్మికుల కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ సి. సూర్యనారాయణ పేర్కొన్నారు. కార్మిక సంక్షేమ పథకాలు, చట్టాలపై అవగాహన లేని పలువురు కార్మికులు కేవలం తమ రెక్కల కష్టం పైనే ఆధారపడి జీవిస్తున్నారన్నారు. అసంఘటిత కార్మికులకు కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో కార్మిక చట్టాలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. అయితే గ్రామీణ ప్రాంతాలలో అవగాహన లేని కార్మికులు ఆ ఫలాలను అందుకోలేకపోతున్నారన్నారు. అలాంటి వారు ప్రమాదవశాత్తు అంగవైకల్యంతో బాధపడేవారు కొందరైతే, మృతిచెందిన వారి కుటుంబాలు మరికొన్ని ఉన్నాయన్నారు. అలాంటి బాధితుల కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో సంక్షేమ పథకాలు వాటి అమలు తీరుపై జిల్లా కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ సి.సూర్యనారాయణ ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలను తెలియజేశారు.

ప్రశ్న : భవన నిర్మాణ, ఇతర పనులు చేసే కార్మికుల సంక్షేమం కోసం మీ శాఖ ద్వారా అమలవుతున్న పథకాలు ఏమిటి.?

జవాబు : అసంఘటిత కార్మికులు సామాజిక భద్రత, ప్రమాద బీమా, అంగవైకల్యం పొందిన వారికి ఆర్థిక సహాయం, కార్మిక కుటుంబాలలోని ఇద్దరు కుమార్తెలకు పెళ్లి కానుక తదితర ప్రయోజనాలు పొందవచ్చు. అయితే కార్మిక శాఖలో గుర్తింపు పొందిన వారికి మాత్రమే ఈ ప్రయోజనాలు వర్తిస్తాయి. ప్రతి కార్మికుడు కార్మిక శాఖ ద్వారా గుర్తింపు కార్డు పొందాల్సి ఉంటుంది.

ప్ర : గుర్తింపు కార్డు పొందేందుకు ఏయేరంగంలోని కార్మికులు అర్హులు?

జ : వ్యవసాయ మరియు అనుబంధ ఉపాధుల్లో పనివారు, చిన్న సన్న కారు రైతులు, వ్యవసాయ కూలీలు, ఉద్యానవన పనివారు, నర్సరీలు, పాడి పరిశ్రమ, మత్స్యకారులు, భవన నిర్మాణ కార్మికులు వాటి అనుబంధ రంగాలలో పనిచేసేవారు, త్రవ్వకం, రాళ్ల కొట్టే పని, సెంట్రింగ్, ప్లంబింగ్, శానిటరీ, పెయింటర్స్, టైల్స్ పనిచేసేవారు, ఎలక్ట్రిషన్, వెల్డింగ్, ఇటుక, సున్నం బట్టీలు, కాంక్రీట్ మిల్లర్, బావులు తవ్వడం, పూడిక తీయడం, టైలరింగ్‌లో పనిచేసేవారు. అలాగే ఆటోమొబైల్ రవాణా రంగంలో పనిచేసే డ్రైవర్లు హెల్పర్లు, చేనేత, కమ్మరి స్వర్ణకారులు, కుమ్మరి, క్షౌరవత్తి, చర్మకారులు రజకులు, వీధి దీపాలు చిరు వ్యాపారులు, తోపుడు బండ్లు వ్యాపారాలు, కల్లుగీత కార్మికులు, పాచి పని చేసేవారు, ఎన్ఆర్ఈజీ వర్కర్లు మిడ్ డే మీల్స్ వర్కర్లు, ఆశాలు, వలస కార్మికులు వీరంతా గుర్తింపు కార్డులకు అర్హులు అవుతారు.

ప్ర : గుర్తింపు కార్డులు ఎక్కడ పొందాలో తెలపండి?

జ : 16 సంవత్సరాల నుండి 50 సంవత్సరాల లోపు వయసు ఉన్నవారు, ఆదాయపన్ను చెల్లించనివారు, ఎంప్లాయిస్ ప్రెసిడెంట్ మరియు స్టేట్ ఇన్సూరెన్స్ (ఈఎస్ఐ) సదుపాయం లేని వారు ఈ గుర్తింపు కార్డు పొందవచ్చు. ఈ కెవైసి కలిగిన ఆధార్ అనుసంధానమైన ఫోన్ నెంబర్ ఇవ్వవలసి ఉంటుంది. వీరు సమీప గ్రామ వార్డు సచివాలయాలు, కామన్ సర్వీసెస్ సెంటర్ లో నమోదు చేయించుకోవచ్చు. నమోదుకు ఎలాంటి రుసుము చెల్లించవలసిన అవసరం లేదు. మరిన్ని వివరాలకు దగ్గరలో ఉన్న కార్మిక శాఖ కార్యాలయంలో సంప్రదించవచ్చు.

ప్ర : గుర్తింపు కార్డు పొందిన కార్మికులకు కలిగే ప్రయోజనాలు వివరించండి ?

జ : కార్మికుని ఇంటిలో ఇద్దరు కుమార్తెల వివాహానికి 20 వేలు చొప్పున మంజూరు, కార్మికుని భార్య లేదా కుమార్తెల ప్రసూతి ఖర్చులకోసం 20 వేలు సహాయం, కార్మికుడు లేదా కార్మికురాలు సాధారణ మరణం పొందితే రూ.60 వేలు, దహన సంస్కారాలకు రూ.20 వేలు, ప్రమాదవశాత్తు మృతిచెందితే రూ. 5 లక్షలు బీమా, అంగవైకల్యం చెందితే అంగవైకల్యం శాతం బట్టి బీమా సౌకర్యం ఉంటుంది. నైపుణ్యం పెంపొందించే శిక్షణలు కూడా ఇవ్వడం జరుగుతుంది. 15 రోజులపాటు ఇచ్చే ఈ శిక్షణలో రోజు స్టైయి ఫండ్ కూడా ఇవ్వడం జరుగుతుంది. గుర్తింపు కార్డు పొందిన కార్మికులు ప్రతిఏటా రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంటుంది.

ప్ర : జిల్లాలో ఎక్కడెక్కడ మీ శాఖలు ఉన్నాయి? సిబ్బంది కొరత ఏమైనా ఉందా ?

జ : జిల్లాలో ధర్మవరం, కదిరి, పెనుకొండ, హిందూపురంలో మా శాఖలు ఉన్నాయి. సిబ్బంది కొరత అంటూ ఏమీ లేదు. సత్యసాయి జిల్లా కేంద్రంలో జిల్లా కార్యాలయం ఏర్పాటు చేయాల్సుంది. ప్రభుత్వం అందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ప్ర : ఇప్పటివరకు జిల్లాలో ఎంతమంది కార్మికులు నమోదు కాబడ్డారు? కార్మికులకు మీరు ఇచ్చే సలహా ఏమిటి?

జ: జిల్లాలో 36 వేల మంది కార్మికులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వారందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేశాం. అసంఘటిత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని, సహకారాన్ని, పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నాం. గుర్తింపు కార్డు నమోదు ఉచితంగా చేసుకోవచ్చు. ఇంకా నమోదు చేయించుకోని కార్మికులు వెంటనే తమ పేరు నమోదు చేసుకుని పథకాలు పొందాలని కోరుతున్నాం.



అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సూర్యనారాయణ

ఉమ్మడి జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఇగా కదిరి వాసి కొమ్ము సంపత్ కుమార్ బాధ్యతల స్వీకరణ

కదిరి అర్బన్ : ఉమ్మడి అనంతపురం జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈగా ఆదివారం కొమ్ము సంపత్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన తిరుపతి విద్యుత్ ప్రధాన కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం ఉద్యోగోన్నతిపై శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల ఎస్ఈగా ఆదివారం అనంతపురం నగరంలోని జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. కదిరి ప్రాంతవాసి కావడంతో ఆ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సంపత్‌కుమార్ ఎస్ఈగా బాధ్యతలు చేపట్టడం కదిరి ప్రాంతానికే గర్వకారణం అని పలువురు కొనియాడుతున్నారు. భవిష్యత్తులో ఆయన మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని పలువురు ఆకాంక్షించారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఈ కొమ్ము సంపత్‌కుమార్


వ్యాస మహర్షి అవార్డు గ్రహీతలు కె.విశ్వనాథ్, డాక్టర్ శివన్న

ఉపాధ్యాయులకు వ్యాస మహర్షి పురస్కారం

ప్రజాశక్తి-మడకశిర/మడకశిర రూరల్

మండలంలోని బుల్లసముద్రం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కె.విశ్వనాథ్, మడకశిర జడ్పీ బాలికోన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు డాక్టర్ శివన్న రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికయ్యారు. గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం వారు కర్నూలు నగరంలోని టీజీ వెంకటేష్ కళాక్షేత్రంలో హిందూ ఉపాధ్యాయ సమితి నిర్వాహకుల నుంచి వ్యాస మహర్షి పురస్కారం అందుకొన్నారు. వారికి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) తరపున ప్రత్యేక అభినందనలు తెలిపారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న, జోగప్ప, ముద్దు గిరిప్ప, నరసింహప్ప, మహలింగప్ప తదితరులు మాట్లాడుతూ విశ్వనాథ్, శివన్నలకు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు దక్కడం హర్షణీయమన్నారు. వారి సేవలను కొనియాడారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు రామాంజనమ్మ, సరస్వతమ్మ, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

రచయిత మైనాస్వామికి ప్రైమ్ న్యూస్ పురస్కారం

ప్రజాశక్తి-గోరంట్ల

ప్రముఖ రచయిత, చరిత్రకారుడు మైనాస్వామికి ప్రైమ్ న్యూస్ టీవీ ఛానల్ ప్రతిభా పురస్కారం ప్రదానం చేసింది. వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన పలువురికి ప్రైమ్ న్యూస్ యాజమాన్యం తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో ఆదివారం పురస్కారాలు ప్రదానం చేసింది. అందులో భాగంగా విజయనగర సామ్రాజ్య చరిత్ర, సంస్కృతి, శాసనాలు, కోటలు, ఆలయాలు, నిర్మాణాలు, తదితర అంశాలపై విస్తృతంగా పరిశోధన కొనసాగిస్తున్న మైనాస్వామిని అతిథులు ఘనంగా సత్కరించారు. అలాగే సినీ నటుడు పృథ్వీరాజ్, ఎన్ఆర్ఐ కొండ నరేంద్ర ద్వారా మైనాస్వామికి ప్రశంసా పత్రంతో పాటు జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


పురస్కారం అందుకుంటున్న మైనాస్వామి


మాట్లాడుతున్న టింబక్టు కలెక్టివ్ ప్రతినిధి మేరీ వటముట్టం

ఘనంగా గ్రామసిరి వార్షికోత్సవ మహాసభ

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలోని షివ్ ఫారం వద్ద ఆదివారం గ్రామసిరి 14వ వార్షికోత్సవ మహాసభను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి టింబక్టు కలెక్టివ్ నుంచి బబ్లూ గంగోలి, మేరీ వటముట్టం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పెనుకొండ, రొద్దం, సికె.పల్లి, రామగిరి మండలాల నుంచి చిన్న జీవాల పెంపకం దారుల సంఘం నుంచి 400 మంది సభ్యులు హాజరయ్యారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఈ 4 మండలాల పరిధిలో గ్రామసిరి సొసైటీ 59 గ్రామాల్లో 80 సంఘాలతో 1,125 మంది సభ్యులు ఉన్నారన్నారు. చిన్న జీవాల పెంపకం ద్వారా సంఘ సభ్యుల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయన్నారు. సంఘ సభ్యులకు రుణాలు ఇచ్చి వారి ఆర్థిక ఎదుగుదలకు తోడ్పాటు అందిస్తున్నామన్నారు. జీవాల సంరక్షణకు నాటు వైద్యం, మందులు తదితర సూచనలు, సలహాలు ఇచ్చి గ్రామసిరి సభ్యులు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో గ్రామసిరి అధ్యక్షులు బిఎన్.సంగప్ప, సీఈవో తిరుమలదేవి, సిబ్బంది రమేష్, ఆంజనేయులు, కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ఆదుకోవాలి

ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

చేనేత కార్మికులను ఆత్మహత్యలు, ఆకలిచావుల నుంచి కాపాడాలని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని చేనేత కార్మిక సంఘం కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ధర్మవరంలో నిబంధనలకు విరుద్ధంగా పవర్‌లూమ్స్ మగ్గాలను ప్రోత్సహించి చేనేత కార్మికులకు ఉపాధి లేకుండా చేసిందన్నారు. ఇప్పటికే ధర్మవరంలో 40 మందికిపైగా చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకోగా గత ప్రభుత్వంలో కేవలం 15 మందికి మాత్రమే రూ. 5 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించారని, మిగిలిన వారికి కూడా చెల్లించాలని కోరారు. చేనేత కార్మికులకు ఉపాధి కరువై కొందరు ఆత్మహత్యలకు పాల్పడగా మరికొందరు వలస బాట పట్టారన్నారు. రెండు రోజుల క్రితం ధర్మవరంలోని శివానగర్‌లో ఓ చేనేత కార్మికుడు, ఆదివారం యాడికిలో చేనేత కార్మికుడు చంద్ర ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. కావున చేతి వృత్తులను పరిరక్షించేందుకు ఆదరణ పథకాన్ని పునరుద్ధరించాలని, 11 రకాల చేనేత వస్త్రాల రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలని, మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని, సబ్సిడీ రుణాలు అందించి చేనేత కారికులను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర

సమాజంలో ఇతరులకు ఉపయోగపడేలా రక్తదానం చేయడం ఎంతో గొప్పదని ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా పట్టణంలోని సాయిబాబా దేవాలయంలో విశేష అలంకరణ, ప్రత్యే పూజా కార్యక్రమాలు చేపట్టారు. అలాగే రక్తదాన శిబిరం నిర్వహించగా యువత పెద్దఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. రక్తదాతలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ మీరు రక్తదానం చేసి ఆపదలో ఉన్న ప్రాణాలు నిలిపిన వారయ్యారన్నారు. అనంతరం ఎమ్మెల్యే సాయిబాబా ఆలయంలో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కుంచిటి ఒక్కలిగ రాష్ట్ర కన్వీనర్ వీఎం.పాండురంగప్ప, టిడిపి మండల కన్వీనర్లు మనోహర్, లక్ష్మీనారాయణ, బేగార్లపల్లి రవికుమార్, అక్కంపల్లి బాబు, మాజీ సర్పంచ్ గుండుమల చంద్రప్ప, బిఎస్.గురుమూర్తి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


రక్తదాతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, గుండుమల

దత్తాత్రేయ రథం లాగిన ఎమ్మెల్యే

మడకశిర రూరల్ : కర్నాటకలోని తుమకూరు జిల్లా చంద్రబావిలో ఉన్న చిదంబర ఆశ్రమంలో వెలసిన దత్తాత్రేయస్వామి బ్రహ్మోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేసమి హాజరై రథం లాగారు. అలాగే స్వామివారి తీర్థ ప్రసాదాములు స్వీకరించారు. అంతకుముందు ఆలయ కమిటీ సభ్యులు వారిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

వైభవంగా అక్కదేవతల జాతర

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండలంలోని సుబ్బరాయునిపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో వెలసిన అక్కదేవతల జాతర ను ఆదివారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. జాతరలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొని, అక్కదేవతల చుట్టూ ఎడ్లబండిపై ప్రదక్షిణలు చేసి, అనంతరం గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ అర్చకులు వారికి పూర్ణ కుంభంతో స్వాగతం పలికి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించారు. జాతర సందర్భంగా ఎడ్లబండ్ల పోటీలు నిర్వహించగా చూసేందుకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. అనంతరం ఏడుగురు చిన్నారులతో అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎడ్లబండ్ల పోటీల్లో రైతులు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పెడపల్లి మాజీ సర్పంచి శ్రీరామ్‌నాయక్ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. జాతరలో ఏర్పాట్లను ఆలయ నిర్వాహకులు బొమ్మయ్య, మహానంద, మణి, నరసింహప్ప, టిడిపి నాయకులు శ్రీరామ్‌నాయక్, బిజెపి నేత నాయుడు. శ్రీరామిరెడ్డి, బెస్త చలపతి, పుల్లప్ప, ఆకుల కుల్లాయప్ప, వెంకటరాముడు పర్యవేక్షించారు.


ఎడ్లబండ్లతో ప్రదక్షిణలు చేస్తున్న ఎమ్మెల్యే సింధూరరెడ్డి, పల్లె రఘునాథ్‌రెడ్డి

వైభవంగా శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి గరుడోత్సవం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం గురుపౌర్ణమి సందర్భంగా గరుడోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా చెన్నకేశవస్వామి ఉత్సవ విగ్రహాన్ని అర్చకులు కోనేరాచార్యులు, మకరంద బాబు, భానుప్రకాశ్ ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు సమక్షంలో స్వామివారిని గరుడ వాహనంలో కొలువుదీర్చి పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నమయ్య సేవా మండలి అధ్యక్షుడు పొరాళ్ల పుల్లయ్య శిష్య బృందం అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు.


గరుడ వాహనంపై కొలువైన చెన్నకేశవుడు

జనసేనపార్టీ కోసం కష్టపడి పనిచేయాలి

హిందూపురం : జనసేన పార్టీ పురోభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పని చేయాలని జనసేన పీఏసీ సభ్యులు కొణిదెల నాగబాబు సూచించినట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం హిందూపురం నియోజకవర్గ జనసేన నేత ఆకుల ఉమేష్, పట్టణ అధ్యక్షులు కొల్లకుంట శేఖర్, చిలమత్తూరు, లేపాక్షి మండలాల నాయకులు చిన్న ప్రవీణ్, లోకేష్ నాగబాబును కలిశారు. ఈ సందర్భంగా నాగబాబు వారికి పలు సూచనలు చేసినట్లు నాయకులు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎలాంటి అవినీతికి తావు లేకుండా ప్రజా పాలన సాగించేలా సహకరించాలని సూచించారన్నారు. గ్రామస్థాయి నుంచి జనసేన పార్టీ నిర్మాణానికి అంకితభావంతో పని చేయాలని, పార్టీ కోసం పని చేసే నాయకులకు తప్పకుండా తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కష్టపడి పని చేసే వారికి పార్టీ అధితనేత, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ తప్పకుండా తగిన సహకారం అందిస్తారని తెలియజేసినట్లు నాయకులు వివరించారు.

మాజీ సర్పంచి మృతికి నివాళి

రొద్దం : మండలంలోని దొడగట్ట మాజీ సర్పంచి కెటి.నారాయణప్ప ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న హిందూపురం ఎంపీ బికె.పార్థసారథి అల్లుడు శశిభూషణ్ వారి గ్రామం వెళ్లి మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట టిడిపి మండల కన్వీనర్ నరహరి, జీవీపీ.నాయుడు, సుబ్బరత్నమ్మ, రొద్దం నరసింహులు, చిన్నప్పయ్య, మురళి ఉన్నారు. అలాగే మంత్రి సవిత భర్త వెంకటేశ్వరరావు సీనియర్ నాయకులు మాధవనాయుడు, నాగేంద్ర, సిద్ధన్న, ఉమాశంకర్, తదితరులు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ముస్లింలపై కేంద్ర మంత్రి అనుచిత వ్యాఖ్యలు తగదు

హిందూపురం : ముస్లింలను ఉద్దేశించి కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడుఉమర్ ఫారూఖ్‌ఖాన్ పేర్కొన్నారు. ఆయన ఆదివారం పట్టణంలోని తన కార్యాలయంలో మాట్లాడుతూ కేంద్ర మంత్రి వ్యాఖ్యలు ముస్లిం సమాజ మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. ముస్లింలను దేశంలో ఉండనివ్వడమే పెద్ద తప్పుగా కేంద్రమంత్రి పేర్కొనడం తగదన్నారు. ముస్లింలను దేశంలో ఉండనివ్వడం మన దౌర్భాగ్యం, లేకపోతే పరిస్థితి వేరేలా ఉండేది' అని పాంచజన్య వీక్లీ మ్యాగజైన్‌లో ఆయన కథనం రాశారని పేర్కొన్నారు. గిరిరాజ్ సింగ్ ఖబడ్దార్, భారత దేశం నీ అబ్బ జాగీరు కాదని హిందువులు, ముస్లింలు , సిక్కులు, దళితులు, బౌద్ధులు , క్రైస్తవులు అన్ని మతాల వారు దేశం కోసం ప్రాణ త్యాగాలు చేశారన్నారు. 8 లక్షల మంది ముస్లిం అమరవీరుల రక్తం ఈ నెలలో ఇంకిన తర్వాతే ఈ మాతృభూమి బానిస సంకెళ్లు తొలగాయన్నారు. భారత దేశం ప్రపంచ దేశాల్లో అతి పెద్ద ప్రజా స్వామ్య దేశం అని తెలియక పోవటం ఆయన అజ్ఞానానికి నిదర్శనం అన్నారు. ముస్లింలు అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ దేశం కోసం ప్రాణ త్యాగం చేయటానికి సిద్ధంగా ఉంటారని స్పష్టం చేశారు.

'మఠం భూములతో నాకు సంబంధం లేదు' : మాజీ ఎమ్మెల్యే

ధర్మవరం టౌన్ : బత్తలపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 401లో 19.84 ఎకరాల నిడిమామిడి ఆంజనేయ స్వామి మఠంకు చెందిన భూమి తనకు సంబంధించినది కాదు అని, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఆ భూమికి నాకు ఎటువంటి సంబంధం లేదని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆ భూముల్లో సిపిఐ ఆధ్వర్యంలో గుడిసెలు వేశారని, ఒకవేళ ఆ భూమి మఠానికి చెందినది అయితే ప్రభుత్వం ఆ భూముల్లో పేదలకు ఇళ్ల పట్టాలు ఇప్పించాలని ఆయన ఎన్‌డిఏ ప్రభుత్వాన్ని కోరారు. ఒకవేళ ప్రస్తుత ప్రభుత్వం ఇవ్వలేని పక్షంలో మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజున పేద ప్రజలకు ఇళ్ల పట్టాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. గతంలో కూడా ఇలాగే నాకు సంబంధంలేని భూములను నావిగా చూపిస్తూ తప్పుడు ప్రచారం చేయడం సరైన పద్ధతి కాదు అన్నారు. అప్పుడు కూడా పలుమార్లు వివరణ ఇచ్చానని, ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

పిచ్చి మొక్కలు, చెత్త తొలగింపు

కదిరి టౌన్ : ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు ఆదివారం పట్టణంలోని 5వ వార్డులో రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను జెసిబిలతో తొలగించారు. అలాగే చెత్త చెదారం తొలగించి పరిశుభ్రత చర్యలు చేపట్టారు. ఆయా రోడ్లకు సంబంధించి నివేదికలు తయారు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఎమ్మెల్యే ఆదేశించినట్లు టిడిపి నాయకులు తెలిపారు. కార్యక్రమంలో 5వ వార్డు టిడిపి నాయకులు రాజా, రమణ, మహేంద్ర, కుసుమకుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మార్కాపురం వద్ద రోడ్డు ప్రమాదం.. ధర్మవరం వాసి మృతి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఒంగోలు జిల్లా మార్కాపురం సమీపంలోని తిమ్మాయపాలెం వద్ద ఆదివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ధర్మవరం పట్టణానికి చెందిన గజ్జల శివయ్య (43) మృతిచెందారు. శివయ్య మెడ్ కేర్ సంస్థలో గ్లోబర్ రెడ్ డైమండ్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా ఒంగోలు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఒంగోలు నుంచి ప్రయివేటు ఓల్వో బస్సులో ఆదివారం రాత్రి ప్రయాణం చేశారు. ఈ బస్సు మార్కాపురం సమీపంలోని తిమ్మాయపాలెంకు రాత్రి 3 గంటలకు చేరుకుంది. అక్కడ గేదే అడ్డు రావడంతో తప్పించబోయి బస్సు బోల్తా పడినట్లు తోటి ప్రయాణికులు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో గజ్జల శివయ్య అక్కడికక్కడే మృతిచెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గజ్జల శివయ్య ప్రస్తుతం అనంతపురంలో నివాసం ఉంటున్నాడు. ఆయనకు భార్య సువర్ణ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.


గజ్జల శివయ్య (ఫైల్‌ఫోటో)

వేధింపుల కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలో ఓ బాలికను మోసం చేసిన నిందితుడిని ఆదివారం అరెస్టు చేసినట్టు వన్‌టౌన్ సిఐ సుబ్రమణ్యం తెలిపారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రాత్రి సిఐ విలేకరుల సమావేశంలో నిందితుడి అరెస్టు వివరాలు వెల్లడించారు. ధర్మవరం పట్టణంలోని గీతానగర్‌కు చెందిన శెట్టిగణేశ్ సాయిరాం ఐటిఐ కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఏడాది క్రితం ప్రియాంక నగర్‌కు చెందిన ఓ మైనర్ బాలికతో పరిచయం ఏర్పరచుకుని వేధిస్తూ ఇబ్బంది పెడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో ఈ నెల 18వ తేదీ బాలిక తండ్రి ద్విచక్ర వాహనంపై బాలికను స్కూల్ వద్ద దించి వెళ్లాడు. ఆయన అటు వెళ్లగానే గణేశ్ ఆ బాలికను బలవంతంగా ఆటోలో ఎక్కించుకుని అనంతపురం వెళ్లాడు. అక్కడి మంచి బెంగళూరు వెళ్లారు. తిరిగి 19వ తేదీ పావగడకు చేరుకున్నారు. అక్కడ అన్నాచెల్లి అని చెప్పి లాడ్జిలో ఓ గదిని అద్దెకు తీసుకున్నారు. బాలికను మభ్యపెట్టి లోబరుచుకున్నాడు. 20వ తేదీ పావగడ నుంచి పెనుకొండకు వచ్చి బాలికను గణేశ్ ధర్మవరం బస్సు ఎక్కించి అక్కడి నుంచి పారిపోయాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని ఎస్పీ, డీఎస్పీ పర్యవేక్షణలో గణేశ్ కోసం గాలించారు. ఈ క్రమంలో గణేష్ యర్రగుంట జంక్షన్‌లో ఉన్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి అరెస్టు చేశామని సిఐ తెలిపారు.


నిందితుడి అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న వన్ టౌన్ సిఐ సుబ్రమణ్యం


ధర్మవరం మండలంలోని చిగిచెర్లలో జలధికి వెళ్తుతున్న పీర్లు

జలధికి తరలిన పీర్లు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మొహర్రం వేడుకల్లో భాగంగా మండలంలోని నిడిమామిడి గ్రామంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో గ్రామస్తులు పీర్లను జలధికి తరలించారు. ఉదయం నుంచి హిందూ ముస్లింలు చావిడిలో పీర్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యువకులు అగ్నిగుండం చుట్టూ నృత్యం చేసి కేరింతలు కొట్టారు. పీర్లను ప్రత్యేకంగా అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగించారు. జలధి కార్యక్రమంలో నిడిమామిడి, కొత్తూరు, కొట్లపల్లి, సురగానిపల్లి, దండువారిపల్లి, బుగ్గపల్లి, గాజులపల్లి, కత్తివారిపల్లి గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : మొహర్రం ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని చిగిచెర్ల గ్రామంలో పీర్లు జలధికి తరలివెళ్లాయి. పెద్దకాశీంస్వామి, చిన్నకాశీంస్వామి, మౌలాలిస్వామి, కుళ్లాయిస్వామి పీర్లకు ముల్లాసాబ్ ప్రత్యేకప్రార్థనలు చేశారు. గ్రామస్తులు పెద్దఎత్తున చక్కెరచదివింపులు, బెల్లం సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. ముందుగా ఉదయం పీర్లు భేటీ తీసుకున్నాయి. సాయంత్రం అగ్ని గుండం పూడ్చి వేసి పీర్లను ఊరేగింపుగా జలధికి తీసుకెళ్లారు. గ్రామస్తులు. బంధువులతో రాకతో పీర్లమకాన్ ప్రాంగణం కిటకిటలాడింది. యువకులు, మహిళలు, వృద్ధులు సైతం మేళాతాళాలు, తప్పెట్ల మధ్య ఉత్సాహంగా గుండం చుట్టూ అలావ్ తొక్కుతూ సందడి చేశారు. కులమతాలకు అతీతంగా గ్రామస్తులు వేడుకలు చేసుకున్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు కృష్ణారెడ్డి, శివారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుబ్బప్పగారి ఓబిరెడ్డి పాల్గొన్నారు.

కొత్తచెరువు : మొహర్రం ఉత్సవాల్లో భాగంగా కొత్త చెరువులో ఆదివారం జలధి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వారం రోజుల నుంచి ఇసుక వంక వీధి, కొండకింద కాలనీ, బోయ వీధి, తదితర కాలనీల్లోని చావిడుల్లో పీర్లని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హిందూ, ముస్లింలు భక్తిశ్రద్ధలతో వేడుకలను నిర్వహించుకున్నారు. గ్రామంలోని వీధుల గుండా పీర్లని ఊరేగిస్తూ అలావ్ తొక్కుతూ ప్రజలు ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరాల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. స్థానిక పుట్టపర్తి రహదారిలోని బాబా ఆలయంలో వేకువ జామున 5 గంటలకు కాకడ హారతి, 6 గంటలకు అభిషేకం, ఆ తర్వాత సాయి నామసంకీర్తన చేశారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకూ బాబా పాద దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సేవా సమితి ప్రతినిధులు బందనాథం సూర్యప్రకాశ్, రామ్‌ప్రసాద్, హేమంత్ కుమార్, జీసీ.నాయుడు, సూర్యనారాయణ, రామలింగయ్య, వీరనారాయణ ఆలయంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే పోతుకుంట, సిద్దయ్యగుట్టలో వెలసిన శ్రీషిరిడీ సాయి బాబా ఆలయాల్లో కూడా గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వన్, టూ టౌన్ సిఐలు సుబ్రమణ్యం, అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నల్లచెరువు : స్థానిక శ్రీ షిరిడీ సాయినాథుని మందిరం భక్తులతో పోటెత్తింది. నల్లచెరువుతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి బాబాను దర్శించుకున్నారు. పలువురు మహిళా భక్తులు సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఎవరికీ అసౌకర్యం కలగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. వేడుకలను నిర్వాహకులు పడుచూరి నగేష్, శిల్ప, రవి, రేఖ, నగేష్‌కుమార్, కరే రవి పర్యవేక్షించారు. తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : పట్టణంలోని వాణి వీధిలో వెలసిన శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో ఆలయ ట్రస్ట్ ఛైర్మన్ మట్టా చిన్నరాయుడు శెట్టి ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. బాబా విగ్రహాన్ని వివిధ రకాల పుష్పాలు, పండ్లతో అలంకరించారు. బాబా సన్నిధిలో హోమాలు, అభిషేకాలు చేశారు. పట్టణంతో పాటు పలు గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి బాబాను దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. 20 వేల మందికి అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఛైర్మన్ తెలిపారు. అలాగే కోనేరు సమీపంలో ఉన్న షిరిడీ సాయి మందిరం, హిందూపురం కూడలి పక్కన ఉన్న సాయిబాబా మందిరాల్లో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఆయా మందిరాలలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు చలమయ్య, శేషాద్రి, రామ్మోహన్, భక్తులు పాల్గొన్నారు. పట్టణంలోని ఆలయాల వద్ద పట్టణ సిఐ పుల్లయ్య ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

కొత్తచెరువు : స్థానిక సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు ఉదయం నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల సందడితో ఆలయం కిక్కిరిసింది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి హరినాథ్‌చౌదరి, టెలిఫోన్ శివయ్య, శ్రీరాములు, డిపో భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో వెలసిన శ్రీనీలకంఠేశ్వర స్వామి ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సిడబ్ల్యుసి మెంబర్, ఆలయ కమిటీ ఛైర్మన్ రఘువీరారెడ్డి కుటుంబ సభ్యులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అంజేసి అన్నదానం చేశారు.

ముదిగుబ్బ : స్థానిక కాశినాయన ఆశ్రమంలో గురుపౌర్ణమి సందర్భంగా భాగవత పారాయణం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నదాన కార్యక్రమాలు పెద్దఎత్తున నిర్వహించారు, ముప్రంరెడ్డి ఆధ్వర్యంలో భాగవత పారాయణం నిర్వహించారు. వారు మాట్లాడుతూ హిందూ సంస్కృతి, సంప్రదాయాల మేరకు అత్యంత పవిత్రమైన భాగవతం, అష్టాదశ పురాణాలు వంటి పవిత్ర గ్రంథాలను మానవాళికి అందించిన ఆది గురువుగా కీర్తించే వ్యాస మహర్షి పుట్టినరోజు పురస్కరించుకొని ఏటా ఆషాడ మాసంలో పౌర్ణమిని వ్యాస పౌర్ణమి, గురుపౌర్ణమిగా నిర్వహించుకోవడం మన ఆచారంలో భాగమైందన్నారు. ప్రతి జీవికి తల్లి మొదటి గురువు కాగా, మనకు విద్యా బుద్ధులు అందించే ఉపాధ్యాయులు తదుపరి స్థానంలో గురువుగా గుర్తింపు పొందారన్నారు. మానవుడు నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవడానికి మార్గదర్శకులుగా నిలిచే వారిని గురువులుగా గౌరవించడం ఆనవాయితీ అన్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించి అన్నదాన చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు నారాయణస్వామి, వెంకటనారాయణ, వెంకటేష్, బిజెపి మండల అధ్యక్షులు సోమల ప్రకాష్ నాయుడు, ఆంజనేయులు, మార్కండేయులు, తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం : స్థానిక శ్రీ షిరిడీ సాయి మందిరంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. అర్చకులు నరసింహ బట్టార్, హరీష్ బట్టార్ సమక్షంలో తెల్లవారుజామున బాబా విగ్రహానికి అభిషేకం, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం హోమాది కార్యక్రమాలను అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. అలాగే శ్రీసత్యనారాయణస్వామి వ్రతాన్ని ఆచరించారు. భక్తులచే అఖండ భజన ఏర్పాటు చేశారు. మహా మంగళహారతి అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.



ధర్మవరం : సాయినగర్ ఆలయంలో బాబాను దర్శించుకుంటున్న భక్తులు, అన్నదాన చేస్తున్న కమిటీ సభ్యులు

వాసవీ సత్ర సముదాయంలో అన్నదానం

పుట్టపర్తి క్రైమ్ : గురు పౌర్ణమి సందర్భంగా ఆదివారం పట్టణంలోని వాసవీ సత్ర సముదాయంలో నిర్వాహకులు అన్నదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ వాసవీ సత్ర సముదాయం లాభాపేక్ష లేకుండా సేవలు అందించడం, పేద విద్యార్థుల కోసం ప్రత్యేకంగా పాఠశాలలు నడపడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకుడు కోటా సత్యం, నిర్వాహకులు పాల్గొన్నారు.


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న పల్లె